క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస రావు

బెల్లంపల్లి: బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోగా సీహెచ్ శ్రీనివాస రావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించిన ఎస్.దేవయ్య తాండూర్ సీఐగా బదిలీ కాగా, ఆయన స్థానంలో కాగజ్‌నగర్‌రూరల్ సీఐగా పనిచేస్తున్న శ్రీనివాస రావును నియమించారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరగా, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

నేడు పొదుపు సంఘాల మహిళల ఉత్పత్తుల మేళా

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉత్పత్తి మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100రోజుల ప్రణాళిక కార్యక్రమం 50రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని మేళా జరుపుతున్నట్లు తెలిపారు. పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బోనమెత్తిన వేమనపల్లి


బోనాలతో వెళ్తున్న మహిళలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఊర పోచమ్మకు సోమవారం బోనాలు చేశారు. కొత్త కుండల్లో పాయసం వండి పోచమ్మ తల్లికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అందరూ సల్లంగా ఉండాలని, సంవృద్ధిగా పంటలు పండాలని వేడుకున్నారు.

సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం


పారాయణం చేస్తున్న మహిళలు

చెన్నూర్: చెన్నూర్ జగన్నాథాలయం, రాధాకృష్ణ ఆలయాల్లో ఆషాఢ బహుళ ఏకాదశి సందర్భంగా సోమవారం మహిళలు సామూహిక విష్ణు సహస్ర నామపారాయణం, గోవింద నామాలను పారాయణం చేశారు. వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ


విద్యార్థిని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని సాయికుంట గిరిజన ఆశ్రమ పాఠశాలలోని ముగ్గురు విద్యార్థినులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతుండగా, వారిని సోమవారం బీజేపీ నాయకులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో హాస్టల్ వార్డెన్లు జాగ్రత్తగా ఉండాలని, విద్యార్థులకు వేడివేడి ఆహారాన్ని పరిశుభ్రంగా వండి అందించాలని సూచించారు. కార్యక్రమంలో గర్మిళ్ల డివిజన్ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజ్‌కుమార్, రాష్ట్ర నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ, దుర్గం అశోక్, కేశెట్టి నాగేశ్వర్‌రావు, మంత్రి రామయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వనమహోత్సవం



వేమనపల్లి: మండలంలోని నీల్వాయి రేంజ్ పరిధిలోని కల్మలపేట సెక్షన్ రేంజ్ అధికారి అఫిజొద్దీన్, మాజీ జెడ్పీటీసీ ఆర్.సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ ఆధ్వర్యంలో వనమహోత్సవం చేపట్టారు. 55మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య మాదిగ, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు లింగాగౌడ్, రాజన్న, ఆత్రం గణపతి, గాలి మధు, తోకల రాంచందర్‌లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు



జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ ఎదురుగా వడ్డెరకాలనీ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిమొక్కలు పెరిగి, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా విద్యుత్ కార్యాలయానికి అధికారులు రాకపోకలు సాగించే జాతీయ రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వెళ్లే ఎల్టీ కేబుల్స్, సెక్షన్ ఫీజు సెట్టు మధ్యలో పెరిగిన పిచ్చిమొక్కలను ఆవులు తినడానికి వస్తున్నాయి. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్ ఎల్టీ వైర్లకు తగులుతున్నాయి. ప్రమాదం జరగకముందే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – మంచిర్యాలఅగ్రికల్చర్

కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువకు గండి..!

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట సమీపంలో గల కడెం డిస్ట్రిబ్యూటరీ 22వ కాలువకు సోమవారం గండిపడింది. దీంతో సాగునీరంతా వృథాగా పోతోంది. కాల్వ ఇప్పటికే శిథిలావస్థకు చేరడంతో, ఇసుకసంచులు వేసి తాత్కాలిక మరమ్మతు చేశారు. ప్రస్తుతం కాలువకు నీరు విడుదల చేయడంతో, ఇసుక సంచులు వేసిన చోట మళ్లీ గండిపడి నీళ్లు వృథాగా పోతున్నాయి. అధికారులు స్పందించి, సాగునీరు వృథా పోకుండా మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.



రోడ్డు మరమ్మతు చేపట్టరూ..!



భీమారం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో గొల్లవాగు ప్రాజెక్ట్ కాలువ పక్కనే నిర్మించిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి నిర్మించిన ప్రధాన కాలువ పొడువు రాకపోకలు కొనసాగించేందుకు ప్రభుత్వం మట్టిరోడ్డు నిర్మించింది. అయితే దానికి మరమ్మతు చేపట్టకపోవడంతో, ప్రస్తుతం బురదమయంగా మారిందని వాపోతున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకొని మట్టిరోడ్డుపై కంకర వేసి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

కదంతొక్కిన ఆదివాసీలు

- 49 జీవో రద్దు చేయాలని డిమాండ్
- జీవో ప్రతులను దహనం చేసి రోడ్లపై రాస్తారోకోలు
- బంద్ సంపూర్ణం
- మద్దతు పలికిన సీపీఎం నాయకులు


దండేపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

బెల్లంపల్లిరూరల్/జన్నారం/దండేపల్లి/చెన్నూర్/కాసిపేట/నెన్నెల/పాతమంచిర్యాల: ఆదివాసీల మనుగడకు ముప్పుగా మారుతున్న జీవో 49ను వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం రోడ్లపై రాస్తారోకోలు, నిరసనలు తెలిపారు. జీవో ప్రతులను దహనం చేశారు. ఆదివాసీల నాయకులు బంద్ ప్రకటించగా సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవోల పేరుతో అడవిపై ఆదివాసీలకు ఎలాంటి హక్కులు లేకుండా చేయడానికి కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ పేరుతో 339గ్రామాలను ఖాళీ చేయించాలని చూస్తోందని, దీంతో ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఆదివాసీలకు ముప్పు కలిగించే జీవోలను రద్దు చేసే వరకు పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు.

- జిల్లా కేంద్రంలో ని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేసి జీవో 49 ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు దుంపల రంజిత్, దూలం శ్రీనివాస్ నాయకులు పాయిరాల రాములు, దాగం శ్రీకాంత్, రత్నవేణి, నిర్మల, రాంచరణ్, దినేష్, మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.
- బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గోమాస అశోక్, సీఐటీయూ బెల్లంపల్లి మండల కన్వీనర్ చల్లూరి దేవదాస్, సీపీఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- జన్నారంలో బంద్ విజయవంతం అయింది. తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కాలి, నాయకులు దర్ము, తొడసం గంగు, మర్సకోల వసంత్, ఆనంద్‌రావు, నానేశ్వర్, యశ్వంత్, లక్ష్మన్, బొజ్జు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.
- దండేపల్లిలో ఆదివాసీ సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. సీపీఎం పార్టీ నాయకులు అశోక్, ఎల్లయ్య, రాజలింగు, రమేష్ మద్దతు పలికారు. కార్యక్రమంలో ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు కనక జంగు, నాయకులు పాల్గొన్నారు.
- చెన్నూర్‌లో ఆదివాసీ గిరిజన సంఘం అధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, టీఏజీఎస్ నాయకులు సామాల ఉమారాణి, మహేశ్, శారద, సరిత, రమాదేవి, పోచం పాల్గొన్నారు.
- కాసిపేట మండలంలోని దేవాపూర్, రొట్టెపల్లి, కొండపూర్ యాపలో కుమురం భీం విగ్రహాల వద్ద జీవో కాపీలు దహనం చేసి నిరసన తెలిపారు. రోడ్డు పై ధర్నా చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడ జంగు, ఆదివాసీ సేన మండలాధ్యక్షుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మడావి వెంకటేష్ నాయకులు పాల్గొన్నారు.
- నెన్నెల మండల కేంద్రంలో అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో జీవో ప్రతులు దహణం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, కోణంపేటలో ఆదివాసీ కొలవార్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పోడు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పుట్ట గంగయ్య, శ్రీను, రవి, మల్లేష్, శంకర్, అంకయ్య పాల్గొన్నారు.


కోణంపేటలో నిరసన తెలుపుతున్న ఆదివాసీలు


బంద్‌లో పాల్గొన్న ఆదివాసీ నాయకులు


చెన్నూర్: జీవో ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

అధికారులతో రైతుల వాగ్వాదం


ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీస్తున్న రైతులు

వేమనపల్లి: సమాచారం ఇవ్వకుండానే కొంత మంది రైతుల పంటలను ధ్వంసం చేస్తారా అని వేమనపల్లిలో రైతులు ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగుతో గొడవకు దిగారు. నీల్వాయి ప్రాజెక్టు 5 ఆర్ డిస్ట్రిబ్యూటరీ ఎడమ కాలువ నిర్మిత పనుల కోసం ఇరువైపులా ఇరిగేషన్ శాఖ దారి కోసం స్థలం కేటాయించింది. పక్కన ఉన్న రైతులు ఆక్రమించుకొని పత్తి, పామాయిల్ పంటలు సాగు చేశారు. దీంతో లోపలికి వెళ్లే దారి లేక ఇటీవల మరో వర్గానికి చెందిన రైతులు తహసీల్దార్‌కు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజలింగు, హన్మంతులు ఉన్నతాధికారుల సూచన మేరకు డోజర్, ట్రాక్టర్‌తో వెళ్లి కొంత మంది రైతుల పంటలను ధ్వంసం చేశారు. 5 ఆర్ కాలువ ఆక్రమిత స్థలం వెంట మొక్కలు నాటిన మొత్తం మంది రైతుల పంటలను ధ్వంసం చేయకుండా, కొంత మందిని టార్గెట్ చేయడమేమిటని వాగ్వాదానికి దిగారు. ట్రాక్టర్‌ను కదలనివ్వబోమని అధికారులతో గొడవకు దిగారు. పంట సాగు చేయకముందే అప్రమత్తం చేయాల్సింది పోయి, నెలన్నర రోజులైన పైరును ధ్వంసం చేయ డం ఏమిటని ప్రశ్నించారు. కొంత మంది కొలు రైతుల పంటను ధ్వంసం చేసి, మిగితా బడా రైతులు ఆక్రమించిన స్థలంలో పంటలను తొలగించకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని పంచాయతీ పెట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


అవగాహన కల్పిస్తున్న సీఐ హన్మోక్

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారికైన కఠిన చర్యలు తప్పవని బెల్లంపల్లి రూరల్ సీఐ చందవోలు హన్మోక్ అన్నారు. బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామ పంచాయతీలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటిని తనిఖీ చేశారు. 15లీటర్ల గుడుంబా, 200లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి లచ్చయ్య, దాలియాలను అదుపులోకి తీసుకున్నారు. సరైన వాహన ధృవీకరణ పత్రాలు లేని 31 ద్విచక్ర వాహనాలు, 03 ఆటోలు సీజ్ చేశారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల ఎస్సై చుంచు రమేశ్, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై వెంకటేష్, వన్ టౌన్, కన్నెపల్లి, భీమిని ఎస్సైలు రాకేష్, భాస్కర్‌రావు, విజయ్, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తోడేళ్ల దాడిలో మేకలు మృతి


మృతి చెందిన మేకలు

వేమనపల్లి: మండలంలోని జాజులపేట అటవీ ప్రాంతంలో తోడేళ్ల దాడికి పాల్పడగా రెండు మేకలు మృతి చెందాయి. గ్రామానికి ఎందిన కుబిడె ఎల్లయ్య మేకల మందతో ఉదయం అడవికి వెళ్లాడు. పోచమ్మ గుట్ట వద్ద అడవి ఎక్కుతుండగా తోడేళ్లు మేకల మందపై పడి ఎల్లయ్యకు చెందిన ఒక మేక, నాగుల సంతోష్‌కు చెందిన మేకపై దాడి చేసి చంపేశాయి. అటవీ అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

అడ్డంకి తొలగదు.. అవస్థలు తీరవు

- నాగారం రోడ్డుకు మోక్షమెప్పుడో?


బురదగా మారిన మంగెనపల్లి, నాగారం రోడ్డు

వేమనపల్లి: మండల కేంద్రం నుంచి బెల్లంపల్లి నియోజకవర్గానికి వెళ్లే నాగారాం రోడ్డుకు అటవీ శాఖ అనుమతి అడ్డంకిగా మారింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న నిర్మాణ పనులు చేసేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వడం లేదు. సుమారు నాలుగున్నర కిలో మీటర్లు ఉన్న రోడ్డు వెంట గుంతలు, అందులో నీరుచేరి రోడ్డు బురదమయంగా మారుతోంది. గత బీఆర్‌ఎస్ హయాంలో కుమురంభీం జిల్లా చిన్నరాసిపల్లి నుంచి నాగారం, వేమనపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. మరోసారి వేమనపల్లి నుంచి ముత్తాపూర్ వరకు ఆర్‌అండ్‌బీ నిధులు మంజూరైనా అటవీ శాఖ అడ్డంకితో పనులు ముందుకు సాగడంలేదు. ఈ రోడ్డుకు అటవీ శాఖతో పాటు టైగర్ రిజర్వు ఫారెస్ట్ కింద గుర్తించడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. రోడ్డు నిర్మించాలంటే టైగర్ కన్జర్వేటర్ అథారిటీ, అటవీ, పర్యావరణ అనుమతులు తప్పనిసరి. తాడోబ, తిప్పేశ్వర్ అడవుల నుంచి కుమురంభీం, మంచిర్యాల జిల్లా అడవుల వైపు పులులు రావడానికి ఇదే రాజమార్గంగా అటవీ శాఖగా గుర్తించింది. ఈ ప్రాంతంలో రోడ్డు వేస్తే పులులతో పాటు వన్యప్రాణులు రోడ్డు దాటి వెళ్లేందుకు అడుగడుగునా ఎకో బ్రిడ్జిలు నిర్మించాలని కూడా నిబంధనలు పెట్టింది. రోడ్డు అనుమతులకు మోక్షం ఎప్పుడా అని మండలవాసులు ఎదురుచూస్తున్నారు.

ఎమ్మెల్యేపైనే ఆశలు..

ప్రతి ఎన్నికల్లో మంగెనపల్లి, నాగారం అటవీ రోడ్డు అనుమతుల అస్త్రం ప్రచార అస్త్రంగా మిగిలిపోతుంది. మేము గెలిస్తే ఈ రోడ్డు నిర్మిస్తామంటూ హామీలు ఇవ్వడమే కానీ, పూర్తి చేయడం కళగానే మిగిలిపోతుంది. బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వినోద్ సైతం ఎన్నికల్లో ఈ రోడ్డు నిర్మిస్తామని హామీ కూడా ఇచ్చారు. ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ అధికారులతో చర్చించి అటవీశాఖ అనుమతుల కోసం నివేదిక పంపించారు. ఈ రోడ్డు నిర్మాణానికి త్వరలో అనుమతులు రానున్నట్లు తెలుపుతున్నారు. ఈ రోడ్డు గుండానే నియోజకవర్గ కేంద్రానికి పక్కన ఉన్న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా గ్రామాలకు నిత్యం రాకపోకలు ఉంటాయి. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపి అటవీ అనుమతులకు లైన్ క్లియర్ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్

మందమర్రిరూరల్: సింగరేణిలో ప్రతీ ఉద్యోగి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ స్వీయ రక్షణతో విధులు నిర్వహించాలని ఏరియా ఇన్‌చార్జ్ జీఎం విజయ్‌ప్రసాద్ అన్నారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టి జనరల్ మేనేజర్ రఘుకుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో ఈపీ ఆపరేటర్స్, ఎంవీ డ్రైవర్స్‌కు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ భూశంకరయ్య, సెంటర్ మేనేజర్ శంకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు మెటీరియల్ అందజేయాలి

మందమర్రిరూరల్: క్రీడాకారులకు మెటీరియల్ అందజేయాలని ఐఎన్టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా జీఎం ఆఫీస్‌లో సోమవారం ఇన్‌చార్జ్ జీఎం, ఎస్వో టు జీఎం విజయ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. మెటీరియల్ అందజేస్తే సరైన ప్రాక్టీస్‌తో క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించే అవకాశముందని వివరించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, నాయకులు యేకుల సత్యం, ఆంజనేయులు, సాంబయ్య తదితరులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

బదిలీలు నిలిపివేయాలి

శ్రీరాంపూర్: రాజకీయ ఒత్తిళ్లతో టీబీజీకేఎస్ నాయకులను టార్గెట్ చేస్తూ చేసిన బదిలీలను వెంటనే నిలిపివేయాలని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్‌లు సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్జీ 1, ఆర్జీ 2 ఏరియాలో తమ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జావిద్‌పాషా, నాయకుడు కొమురయ్యలను అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయ కక్షతో అధికారులపై ఒత్తిడి తెచ్చి బదిలీ చేశారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బదిలీలను నిలిపివేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

వెంటిలేషన్ మెరుగుపర్చాలి


కార్మికులతో మాట్లాడుతున్న బాజీసైదా

శ్రీరాంపూర్: గనిలో వెంటిలేషన్ లేక కార్మికులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే మెరుగుపర్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రెటరీ షేక్ బాజీ సైదా డిమాండ్ చేశారు. ఆర్కే 7 గనిని సోమవారం ఆయన సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. గనిలోని సౌత్ 2ఏ సీంలో వెంటిలేషన్ ఇబ్బందిగా ఉందన్నారు. హ్యాండ్ గ్లౌజ్‌లు కూడా ఇవ్వడం లేదని, దీంట్లో పనిచేసేటప్పుడు చేతులకు గాయాలవుతున్నాయన్నారు. ఎలక్ట్రిషన్లకు, ఫిట్టర్లకు హెల్పర్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ ఏరియా కార్యదర్శి సంపత్, ఫిట్ కార్యదర్శి మారుపల్లి సారయ్య, నాయకులు నామాని సదానందం పాల్గొన్నారు.

జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్స్ ఎన్నికలు


నూతన కార్యవర్గానికి నియామక లేఖ అందిస్తున్న రాష్ట్ర, జిల్లా బాధ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల జిల్లా ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లోని రాముని చెరువు పోచమ్మ ఆలయం వద్ద ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల కమిటీ సభ్యులుగా మహిమల కేదార్‌రెడ్డి, ఎలగందుల శ్రీనివాస్‌లు వ్యవహరించగా ఒకే ఒక నామినేషన్ వచ్చింది. కాగా జిల్లా కార్యవర్గం అంతా కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మహావీర్ అప్పాసు రాము, ప్రధాన కార్యదర్శిగా శ్వాస తిరుపతి, కోశాధికారిగా ముక్కెర శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేశ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు పోగుల విజయ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందు, ప్రధాన కార్యదర్శి భూమన్న, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు వడ్లకొండ కనకయ్యగౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు కలర్స్ సతీశ్, జిల్లా సలహాదారుడు లక్కీ మల్లీకార్జున్, జిల్లా అసోసియేషన్ ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

షెడ్డు ధ్వసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జైపూర్: మండల కేంద్రంలో వెన్నెల వీవో మహిళా గ్రూపునకు చెందిన తాత్కాలిక షెడ్డును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని వీవో అధ్యక్షురాలు మద్దుల సునీతరెడ్డి, మాజీ అధ్యక్షురాలు కూన అంజలి, కోశాధికారి దీపికలు తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లయన్స్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

చెన్నూర్: చెన్నూర్ లయన్స్‌క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ రాజేంద్రప్రసాద్, ఎక్సటెన్షన్ చైర్‌పర్సన్ వెంకటేశ్వర్లు తెలిపారు. చెన్నూర్ అధ్యక్షుడిగా జాడి తిరుపతి, కార్యదర్శిగా సొడం శ్రీనివాస్, కోశాధికారిగా నిమ్మల సాగర్, ఉపాధ్యక్షులుగా నాగరాజుగౌడ్, కట్ట సదానందం, జాయింట్ సెక్రెటరీగా మాదాసు కిష్టయ్య ఎన్నికయ్యారు.

సంతాప సభ

పాతమంచిర్యాల: తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్ సంతాప సభను జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో బీసీ సంఘాల నాయకులు, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు, బీసీ హక్కుల పోరాట సమితి, బీసీ జేఏసీ నాయకులు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్‌లు

నెన్నెల: నెన్నెల కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి కవిత తెలిపారు. సీఈసీలో 20, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 10 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు.